క్రాస్ కంట్రీ విజేత సీఎఫ్‌సీ

2-0తో వన్డే సిరీస్ కైవసం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: క్రాస్ కంట్రీ క్రికెట్ టోర్నీలో సీఎఫ్‌సీ ఎక్సలెన్సీ క్రికెట్ అకాడమీ విజేతగా నిలిచింది. మెల్‌బోర్న్ క్రికెట్ అకాడమీతో జరిగిన రెండు వన్డేల సిరీస్‌ను సీఎఫ్‌సీ టీమ్ 2-0తో కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో వన్డేలో సీఎఫ్‌సీ 6 పరుగుల తేడాతో మెల్‌బోర్న్‌పై గెలిచింది. తొలుత సీఎఫ్‌సీ 49.4 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. ఆర్యన్(71), షానవాజ్(54) అర్ధ సెంచరీలతో అలరించారు. ఛేదనలో మెల్‌బోర్న్ టీమ్ 48.3 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. ఈ సందర్భంగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న క్రికెటర్లు రోహిత్ రాయుడు, కార్తీకేయ, సిరి చందన, అనురాగ్, యశస్వి, శృనిత్ రెడ్డిలను హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, సహాయ కార్యదర్శి బసవరాజు, సీఎఫ్‌సీ అకాడమీ హెడ్ కోచ్ జగదీశ్‌రెడ్డి అభినందించి, రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. సీఎఫ్‌సీ ఫౌండర్ సభ్యులు భరణి, విజేత జట్టుకు ట్రోఫీని బహుకరించారు.

కూటి కోసమే..

ఒకవైపు పావురాలకు దానా అమ్మే వ్యక్తి..కొనే వారి కోసం ఆత్రుతగా చూస్తుంటే.. మరోవైపు ఆహారం కోసం పావురాలూ ఎదురు చూస్తున్నట్లు ఉన్నాయి.. ఏదైనా కూటి కోసమే అన్నట్లు.. రెండు భిన్నకోణాలున్న ఈ దృశ్యం.. నాంపల్లి మెట్రోస్టేషన్ వద్ద కనిపించింది

సమతావాది బాబు జగ్జీవన్ రామ్

జయంతి కార్యక్రమంలో వక్తలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) :స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతిని జలమండలిలో ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జలమండలి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఎండీ సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డైరెక్టర్లు డాక్టర్ ఎం.సత్యనారాయణ, రవికుమార్, స్వామి, వినోద్ భార్గవ, దశరథ్ రెడ్డి, టీవీ శ్రీధర్, యూనియన్ నాయకులు జి.రాంబాబు యాదవ్, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో...

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి అడిషనల్ కమిషనర్లు లేక్ శివకుమార్ నాయుడు, శ్రీవాస్తవ(ఎస్టేట్స్), నళిని పద్మావతి, యాదగిరి రావు, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, ఎంటమాలజి చీఫ్ డాక్టర్ రాంబాబు, యూబీడీ డైరెక్టర్ శ్రీనివాస రావు, సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా పూలమాల వేసి నివాళులర్పించారు.

టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లో..

ఖైరతాబాద్‌లోని టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీవీఓ నారాయణ, జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్ రావు, ఉన్నతాధికారులు శ్రీనివాస్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్‌లో...

హైదరాబాద్ కలెక్టరేట్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆకర్షణ సతీష్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆకర్షణ సతీష్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాలకు అందజేస్తున్న డాక్టర్ దండా వసుధ రాణి

అమీర్‌పేట్, ఏప్రిల్ 5 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆకర్షణ సతీష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. సనత్‌నగర్‌లోని కాసా పారడిసో (లోధా అపార్ట్‌మెంట్స్) రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయ నిర్ణేత డాక్టర్ దండా వసుధ రాణి 2024 రికార్డు పత్రాలతో పాటు మెడల్, ధృవీకరణ పత్రాన్ని ఆకర్షణ సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతలను స్వీకరించేందుకు స్ఫూర్తిదాయకమైన ఆలోచనలే తప్ప వయసుతో సంబంధం లేదని ఆకర్షణ సతీష్ తన చర్యల ద్వారా నిరూపించారన్నారు. తన చదువులకు ఎక్కడ ఆటంకాలు తలెత్తకుండా లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్న ఆకర్షణను, సాక్షాత్తు ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ ద్వారా ప్రశంసించడమే కాకుండా స్వయంగా కలిసి అభినందనలు తెలపడం గొప్ప విషయమన్నారు. ఈ యేడాది చివరినాటికి 25 గ్రంథాలయాలు నెలకొల్పాలన్న తన లక్ష్యాన్ని సాధించాలని, ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, అమీర్‌పేట్ కార్పొరేటర్ కేతినేని సరళ తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లి చెరువును కాపాడండి

ఖైరతాబాద్, ఏప్రిల్ 5 : శతాబ్దాల చరిత్ర కలిగిన బమ్ రుక్నుద్దౌల చెరువును కబ్జా చెర నుంచి కాపాడాలని సెంటర్ ఫర్ వెల్‌బీయింగ్ ఎకనామిక్స్ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్, సామాజికవేత్త లుబ్నా సర్వత్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. గ్రేటర్ పరిధి శివరాంపల్లిలోని పోలీస్ అకాడమి ఎదురుగా సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో బమ్ రుక్నుదౌల పేరుతో ఉన్న చెరువును కొందరు చదును చేశారన్నారు. 1700 సంవత్సరంలో అప్పటి పాలకులు ఈ చెరువును అభివృద్ధి చేశారని, ఇందులోని నీటినే రాజులు తాగేవారని తెలిపారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువును కాలక్రమేణా కబ్జా చేస్తూ వచ్చారని, 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పూర్తి చెరువును మాయం చేశారన్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించానని, గత ప్రభుత్వ హయాంలో అధికారులు సైతం సర్వే చేశారన్నారు. ఈ చెరువు కబ్జాపై హైకోర్టును ప్రభుత్వం తరపున ఆశ్రయించినట్లు తెలిపారు. అయితే హైకోర్టును సింగల్ బెంచ్ గతేడాది ఆ కేసును కొట్టివేసిందని, ఈ నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ కూడా కేసును పూర్తిగా విచారణ జరుపకుండా వాయిదా వేసిందన్నారు. ఫలితంగా చెరువును మొత్తం చదును చేసి నిర్మాణాలు సైతం చేపట్టారని తెలిపారు. అవసరమైతే సుప్రీం కోర్టును సైతం ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ మైనార్టీ కమిషన్ మాజీ సభ్యులు, న్యాయవాది సయ్యద్ తారఖ్, ఖాద్రి, ఫారూఖ్ హుస్సేన్ పాల్గొన్నారు.

పురాతన కట్టడాలను కాపాడుకుందాం

అర్కిటెక్చరల్ జాతీయ సదస్సులో విజయనగరం ఉజ్జీవని ట్రస్టీ రాణి రత్నశ్రీ

జేఎన్ఐఏఎస్ కళాశాలలో జాతీయ సదస్సులో సావనీర్ విడుదల చేస్తున్న విజయనగరం ఉజ్జీవని ట్రస్టీ రాణి రత్నశ్రీ తదతరులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 5 : పురాతన కట్టడాలను పరిశీలించడం ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వం, చారిత్రక విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని విజయనగరం ఉజ్జీవని ట్రస్టీ రాణి రత్నశ్రీ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న 'అర్కిటెక్చరల్ అండ్ కల్చరల్ కార్నర్ స్టోన్స్' జాతీయ సదస్సుకు రాణి రత్నశ్రీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో కాకతీయులు, చోళులు, విజయనగర రాజులు ఎన్నో అద్భుతమైన కట్టాలను నిర్మించి ఎంతో విలువైన సాంస్కృతిక వారసత్వాన్ని అందించారన్నారు. ఆ కాలంలో నిర్మించిన కట్టడాలను తిలకించడం ద్వారా అప్పటి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు అద్భుతమైన ఇంజినీరింగ్ విశేషాలు తెలుసుకోవచ్చున్నారు. చరిత్ర అంటే కేవలం గతించిన కాలం మాత్రమే కాదని, విభిన్న రకాలైన సాంప్రదాయాలు, నిర్మాణ శైలి లాంటి అనేక విషయాలకు సంబంధించిన విషయాన్ని హెరిటేజ్ కట్టడాల్లో గుర్తించవచ్చన్నారు. పురాతన కట్టడాలను కాపాడుకునేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు విశేషంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అదనపు డైరెక్టర్ జాన్వీజ్‌క పూర్ తమ సంస్థ ఆధ్వర్యంలో వరంగల్‌లోని వేయి స్తంభాల గుడితోపాటు ఇతర కట్టడాలను కాపాడేందుకు చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ భవనాలకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీపీఏ హైదరాబాద్ చాప్టర్ ప్రొ.నర్సింహులు, మూర్తిక్షేత్ర ఆర్కిటెక్ట్ జి.సూర్యనారాయణ, ఇంటాక్ హైదరాబాద్ కన్వీనర్ పి.అనురాధారెడ్డి, జేఎన్ఐఏఎస్ ప్రిన్సిపల్ శాలిని, రిజిస్ట్రార్ డా.సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న బాంబే సర్కస్

ఎల్బీనగర్ జోన్: ఎల్బీనగర్‌లోని ఆటోనగర్‌లో మార్చి 29న ప్రారంభమైన బాంబే సర్కస్ ఇప్పటికీ విజయవంతంగా కొనసాగుతుంది. ప్రజలు పిల్లా పాపలతో పెద్ద ఎత్తున తరలొచ్చి సర్కస్ ప్రాంగణంలో సందడిగా గడుపుతున్నారు. సర్కస్ రోజు వారి ప్రదర్శనలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం పేర్కొన్నారు. రోలర్ బ్యాలెన్స్, స్కైవాక్, స్వింగింగ్ జిమ్ తదితర విన్యాసాలతో సర్కస్ బృందం ఆకట్టుకుంటున్నది. చిన్నల నుంచి పెద్దల వరకు సర్కస్ చూడటానికి అంతా అమిత ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సర్కస్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. గ్రేట్ బాంబే సర్కస్ దేశంలోనే మొదటిసారిగా సముద్ర సింహాలు, గొరిల్లాలు, లామా, బ్లాక్ ప్యాంతర్, హిప్పోపొటామిస్ తదితర అన్యదేశ జంతువులతో విన్యాసాలు ప్రదర్శించి అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

సుప్రీంకోర్టు తీర్పుతో..బీజేపీ అవినీతి బట్టబయలు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఎలక్టోరల్ బాండ్స్ విధానంలో కోట్ల విరాళాలు

ప్రజలను దారి మళ్లించడానికి ఈడీ, సీబీఐ వినియోగం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 : సుప్రీం కోర్టు తీర్పుతో ఎలక్టోరల్ బాండ్స్ విధానంలో అధికార పక్షం అవినీతి బట్టబయలైందని పలువురు వక్తలు అన్నారు. పాలమూరు అధ్యయన వేదిక, వీక్షణం కలెక్టివ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎలక్టోరల్ బాండ్స్ విధానం, సుప్రీం కోర్టు తీర్పు పర్యావసానాలపై రౌంట్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కంపెనీలు రాజకీయ పార్టీలకు అందులో ముఖ్యంగా బీజేపీకి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చి.. ఇప్పుడు నష్టాన్ని చూపించడం ఆశ్చర్యకరమని అన్నారు. నష్టాల్లో ఉన్న కంపెనీలు ఏ విధంగా రాజకీయ పార్టీలకు కోట్ల రూపాయలు ఇస్తాయని పశ్నించారు. ప్రజలను ఈ చర్చనుంచి దారి మళ్లించడానికి కేంద్ర ప్రభుత్వం తన చేతిలోని ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు తప్పుడు విధానాలు అమలు చేయడం పెరిగిందన్నారు. ఇది ప్రజలకు, ప్రజాస్వామ్యానికి మంచిది కాదని తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ ప్రొఫెసర్ పాపారావు, ప్రొఫెసర్ కోదండరాం, కన్నెగంటి రవి, తదితరుల పాల్గొన్నారు.

మాదిగ జాతిపై సీఎం రేవంత్ రెడ్డి వివక్ష

జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు నవీన్‌రాజు

రవీంద్రభారతి, ఏప్రిల్ 5 : దేశ తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరిచిందని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఎప్పుడూ ఇలా అమవానం జరుగ లేదని, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే ఇలా చేశారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించి ప్రజలకు అన్ని వసతులు కల్పించేదని తెలిపారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ మహనీయులపై కుట్రపన్ని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను అత్యంత దారుణంగా నిర్వహించారని మండిపడ్డారు. జయంతి వేడుకలకు వచ్చే ప్రజలకు కనీసం మంచినీటి సౌకర్యం, ఇతర వసతులు కల్పించకుండా మాదిగ మహనీయులను, మాదిగజాతిని అవమానపరిచారని విమర్శించారు. మాదిగ ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ మహనీయులను విస్మరించడం సరికాదని, ఈ విధంగానే మాదిగ జాతిపై వివక్ష కొనసాగితే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాబోయే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లకుంట నరసింహా, ముగులు కోటేశ్వరరావు, జగదీశ్‌రావు, రామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ - 3 విజయంలో 'ఆమె' పాత్ర కీలకం

ఇస్రోలో పురుషులతో సమానంగా పరిశోధనలు చేస్తాం

హాలీవుడ్ సినిమా కంటే తక్కువ ఖర్చుతో మూన్ ల్యాండర్‌ను రూపొందించాం

ఇస్రో శాస్త్రవేత్తలు డాక్టర్ టెస్సీ థామస్, కల్పన కాళహస్తి

చర్చా వేదికలో మాట్లాడుతున్న టెస్సీ థామస్, చిత్రంలో కల్పన కాళహస్తి, ప్రియా

ఖైరతాబాద్, ఏప్రిల్ 5 : ఇస్రోలో స్త్రీ, పురుష అనే లింగ బేధాలుండవని.. పురుషులతో కలిసి మహిళా శాస్త్రవేత్తలు సమానంగా పరిశోధనలు జరుపుతారని ఇస్రో శాస్త్రవేత్తలు టెస్సీ థామస్, కల్పన కాళహస్తి అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో 'స్టెల్లార్ జర్నీస్' అనే అంశంపై ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ ప్రియా గజ్జార్‌తో జరిగిన చర్చావేదికలో వారు మాట్లాడారు. తాము డీఆర్‌డీవోలో చేరినప్పుడు కేవలం ఒకటి లేదా రెండు శాతం మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండేవారని, ప్రస్తుతం 15 శాతం మహిళలు పని చేస్తున్నారని పేర్కొన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మెన్ దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ నుంచి తాము చాలా నేర్చుకున్నామని, తమ విజయంలో ఆయన స్ఫూర్తి ఎంతో ఉందన్నారు. చంద్రయాన్ విజయంలోనే మహిళా శాస్త్రవేత్తల పాత్ర ఎంతో కీలకంగా ఉందని, రాకెట్ నాలుగు లక్షల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత చంద్రునిపై దిగే ప్రక్రియ సాఫీగా సాగుతుందనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించామని, అందులో విజయం సాధించామన్నారు. మానవ సహితా ప్రాజెక్టు సైతం ముందుకు సాగుతుందని, త్వరలోనే అది సాకారమవుతుందని తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..

- వేసవి సెలవుల్లో తరగతులు - కార్పొరేట్ కళాశాలల నిర్వాకం

మియాపూర్ , ఏప్రిల్ 5 : ఇంటర్ బోర్డు ఆదేశాలను కార్పొరేట్ కళాశాలలు ఏమాత్రం ఖాతరు చేయటం లేదు. ప్రభుత్వ విద్యా క్యాలెండర్‌కు పాతరేసి.. తమ సొంత క్యాలెండర్‌ను బాహటంగా అమలు చేస్తున్నారు. ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. అయినప్పటికీ కార్పొరేట్ కళాశాలలు సెలవులను ఏమాత్రం అమలు చేయకుండా ద్వితీయ సంవత్సరం తరగతులను నిర్వహిస్తున్నారు. ఇటీవల పలు కళాశాలల్లో ఈ తరహా తరగతులపై విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయటంతో డీ స్కాలర్స్ కళాశాలలకు ప్రత్యక్ష తరగతులను నిలిపివేసి ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే రెసిడెన్షియల్ తరహాలో నడుస్తున్న కళాశాలల్లో గుట్టుగా ద్వితీయ సంవత్సరం తరగతులను కొనసాగిస్తున్నారు. అడ్వాన్స్డ్, జేఈఈ మెయిన్స్ సహా ఇతర పరీక్షల పేరిట వేసవి సెలవుల్లోనూ తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేసేందుకు కొన్ని విద్యాసంస్థలు వేసవి తరగతులను అవకాశంగా వినియోగించుకుంటున్నాయి. ప్రధానంగా మాదాపూర్, మదీనాగూడ, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, పటాన్‌చెరు సహా ఇతర ప్రాంతాల్లో వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సెలవుల్లో కళాశాలకు పంపేందుకు ఆసక్తి కనబరుస్తుండటం గమనార్హం. విద్యా క్యాలెండర్ పేరిట తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు వేసవి సెలవుల్లోనూ తరగతుల పేరిట మరింత ఒత్తిడికి గురవుతున్నారు.

కలశ జువెల్స్‌లో ఏడువారాల నగలు

మేకింగ్ చార్జీలు, వేస్టేజ్ ఉండదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 5 : బంజారా హిల్స్ రోడ్ నం.10లోని కలశ ఫైన్ జువెల్స్‌లో 'ఏడు వారాల నగలు' పేరుతో ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. తెలుగు సినీనటి ముచ్చెర్ల అరుణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాల కలెక్షన్లను ఆవిష్కరించారు. కలశ జువెల్స్ 7వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో భాగంగా మేకింగ్ చార్జీలు, వేస్టేజ్ ఉండదని నిర్వాహకులు తెలిపారు.